



దర్శనాలు చేసుకుంటున్న భక్తులు

6లో

వైభవంగా బ్రహ్మసమేధ్యం తీర్థం

6లో

ఇక ఎమ్మెల్సీ పోరు!

మోగిన ఎన్నికల నగారా



ఈ ఏడాది ఆరంభంలోనే ఎన్నికల సందడి మొదలైంది. చాలాకాలం నుంచి పట్టభద్రులు ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. ఇప్పటికే కార్యరంగం సిద్ధం చేసుకుని వివిధ వర్గాలతో అనేకమంది అభ్యర్థులు ఓటర్లతో మమేకం అవుతూ వస్తున్నారు. 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థుల గడువు ముగియనుండడంతో తిరిగి ఎన్నిక అనివార్యమైంది. ఈసారి టీడీపీ సహా పెద్ద సంఖ్యలోనే అభ్యర్థులు రంగంలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఆ మేరకు ఎన్నికల్లోను నువ్వానేనా అనేటట్టుగా అభ్యర్థులు ఢీకొనబోతున్నారు.

- ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- ఈసారి రంగంలో టీడీపీ అభ్యర్థి
- ఇప్పటికే ప్రచార పర్వంలోకి
- వామపక్షాలతోపాటు బరిలోకి అత్యధికులు
- హోరాహోరీ పోటీ తప్పదా..





పేరాబత్తుల రాజశేఖర్... దిడ్ల వీరరాఘవులు

(కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం / ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో సమాంతరంగా ఎన్నికల 'కోడ్' కూసింది. ఇప్పటికే కూటమి తరపున టీడీపీ సహా మిగతా పక్షాలు తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు సన్నాహాల్లో ఉన్నాయి. కూటమి టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను మూడు నెలల కిందటే రంగంలోకి దింపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభం నుంచి రాజశేఖర్ తన పని తాను చేసుకుంటూపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎమ్మెల్సీల్లో ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి గెలిచేలా చూడాలని ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం జిల్లాస్థాయి నాయకత్వాన్ని ఆదేశించింది. తాజాగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాజశేఖర్ గెలుపు పార్టీకి అత్యవసరమని, ఎక్కడా పొరపాట్లకు, లోటు పాట్లకు తావివ్వద్దని పార్టీ ముఖ్యుల భేటీలో సీఎం చంద్రబాబు సూచనలు జారీ చేశారు. బుధవారం రాజశేఖర్ అమరావతిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిమంత్రి నారా లోకేష్‌తో కూడా సమావేశమయ్యారు. ఇప్పటికే కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నేతల మద్దతు ఆయనకు లభించింది. దీంతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ఆరంభ దశలోనే ఆయనను ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించేలా పార్టీ ముఖ్యులు చొరవ చూపారు. అన్ని నియోజకవర్గాల్లోను పట్టభద్రుల ఓటర్ల చేరికలో చొరవ తీసుకోవాల్సిందిగా ఉభయగోదావరి జిల్లాల నేతలకు అప్పట్లోనే ఆదేశాలు అందాయి. దీంతో పార్టీ సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి మరీ రాజశేఖర్‌ను పార్టీ కేడర్‌కు పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన వివిధ నియోజకవర్గాల్లో ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటూ వస్తున్నారు. ఇంకోవైపు గడిచిన 2019లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అప్పట్లో వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి ఐ.వెంకటేశ్వరరావు గెలుపొందారు. విద్యావేత్త శేషారెడ్డిపై వెంకటేశ్వరరావు విజయం సాధించారు. ఆనాటి ఎన్నికల్లో వీరిద్దరి మధ్య హోరాహోరీగానే పోరు సాగింది. పట్టభద్రుల ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి రకరకాల ప్రయోగాలు చేశారు. వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి కాకుండా తమకు మద్దతు ఇస్తే అనూహ్యంగా సరైన స్థితిగతులు కల్పిస్తామంటూ మిగతా వారంతా పెద్దఎత్తున ప్రచారం సాగించారు. అయినప్పటికీ పట్టభద్రుల ఓటర్లు వెంకటేశ్వరరావు వైపే మొగ్గు చూపారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగకుండా జాగ్రత్తపడింది. ఈసారి వామపక్షాల మద్దతుతో తూర్పుగోదావరికి చెందిన దిడ్ల వీరరాఘవులు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. తాము బలపరిచిన అభ్యర్థి గెలుపొందేలా, ఉమ్మడి నిర్ణయం అమలయ్యేలా వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలో లేని పక్షానికే ఓటర్ల మొగ్గు ఉంటుందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము బలపరిచిన అభ్యర్థే గెలుపొందుతారన్న ధీమాతో ఉన్నారు. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున అభ్యర్థులు పోటీకి దిగే అవకాశాలు స్పష్టంగా కనపడుతున్నాయి. గతం కంటే భిన్నంగా ఈసారి పట్టభద్రుల్లో చైతన్యం రావడం, ఓటర్ల జాబితాలో సంతృప్తికర స్థాయిలో ఓటర్ల నమోదు జరగడం మరో పరిణామం. సాధ్యమైనంత మేర ఓటర్లను ఆకర్షించడం, గెలుపుకు చేరువకావడం అనే రెండు లక్ష్యాలను సాధించేందుకు తహతహలాడుతున్నారు. ప్రతిపక్ష వైసీపీ నుంచి పోటీ ఉంటుందా లేదా ఎవరికైనా మద్దతుగా నిలుస్తుందా.. స్పష్టత లేదు.

పురుష ఓటర్లదే ఆధిక్యత

గడిచిన మూడు మాసాలుగా ఓటర్ల జాబితాలో చేరికలు భారీగానే సాగాయి. నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్య నేతలు పట్టుపట్టి మరీ ఓటర్ల చేరికను ప్రోత్సహించారు. గడిచిన నెలన్నర కిందట ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్ల జాబితాలో కేవలం లక్షా 27 వేల మంది నమోదయ్యారు. ఆ తదుపరి నియోజకవర్గాల వారీగా సమీక్ష సాగడంతో ఒక్కసారిగా ఈ సంఖ్య ఎక్కడికక్కడ పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓటర్ల సంఖ్య మూడు లక్షల 15 వేల 261గా ఉంది. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య లక్షా 83 వేల 734 కాగా, అదే మహిళా ఓటర్ల సంఖ్య వీరికంటే తక్కువగా లక్షా 31 వేల 507గా లెక్క తేలింది. అంటే పట్టభద్రుల నియోజకవర్గంలో పురుష ఓటర్లే గెలుపోటములకు నిర్ణేతలు కాబోతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 602 మంది ఓటర్లు ఉండగా అదే పశ్చిమగోదావరిలో 69 వేల 884 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో పట్టభద్రులకు చోటు కల్పించే దిశగా ఏపీ ఎన్జీవోలు ఒకింత చొరవ చూపారు.

- నేటి నుంచి అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల
- 27న పోలింగ్.. మార్చి 3న కౌంటింగ్

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నిక నగరా మోగింది. ఏపీలో రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ విడుదలైంది. తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వతేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్ల వడపోత చేయనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ గడువుగా ప్రకటించారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ప్రక్రియ 8వ తేదీలోగా ముగించాల్సి ఉంది. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఇంతవరకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 3 లక్షల15 వేల 261మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు జరిగింది. ఇదిలా ఉండగా, ఈనెల 31వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు గడువు ఉంది.

సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫిబ్రవరి 1న కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో జరగాల్సిన సీఎం చంద్రబాబునాయుడు పర్యటన రద్దు అయింది. పేదల గృహ ప్రవేశాలు ప్రారంభం, పింఛన్ల పంపిణీతో పాటు ఇక్కడ సభ నిర్వహించడానికి తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లుచేసింది. తాజాగా సీఎం పర్యటన ఇక్కడ రద్దుచేసి అన్నమయ్య జిల్లాకు సీఎం సభను మార్చారు.



ఆలమూరు మండలం గోదావరి లంక భూములలో సాగు చేస్తున్న పూల తోట

పూల రైతుల డీలా

- ఒక్కసారిగా పడిపోయిన పూల ధరలు
- గోదావరి లంక భూములలో జోరుగా పూల సాగు
- ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్‌పైనే రైతుల ఆశలు

ఆలమూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): లాభసాటిగా ఉంటుందని ఎన్నో ఆశలతో గోదావరి తీరం లంక భూములలో పూల సాగు చేపట్టిన రైతులు ఇప్పుడు ధర లేక డీలా పడ్డారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలో వందలాది ఎకరాలలో పూల సాగు జరుగుతోంది. ఇక్కడ బంతి, చామంతితో పాటు అనేక రకాల పువ్వుల తోటలు పెంచుతున్నారు. అయితే ప్రస్తుతం ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలో చామంతి రూ.30కు పడిపోవడంతో తోటలలో కోసి మార్కెట్‌కు తరలించే ధర కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, కపిలేశ్వరపురం మండలాలలో ఈ పూల సాగు అధికంగా జరుగుతోంది. ఆలమూరు మండలం బడుగువాని లంకలో చామంతి సాగు చేయడంలో రైతులు అనేక రకాల మెలకువలు పాటించి నాణ్యతతో కూడిన పూల సాగు చేస్తుంటారు. ముఖ్యంగా బెంగళూరు వెరైటీలు ఇక్కడ సాగు చేయడంలో ప్రసిద్ధి. ప్రస్తుతం బడుగువానిలంక లంక భూములలో పూల తివాచీగా కనిపిస్తోంది. పూల దిగుబడికి సీజన్ కావడంతో పూల తోటలు విరబూసి సుందరంగా కనిపిస్తున్నాయి. అయితే దిగుబడులు బాగా ఉన్నప్పటికీ ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరు నుంచి ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్‌పై రైతులు బోలెడంత ఆశతో ఉన్నారు. ఫిబ్రవరి నెలలో అధికంగా ముహూర్తాలు ఉండటంతో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నారు.



మాఘం..సకల శుభాల మాసం

- నేటి నుంచి పెళ్లిళ్లు, గృహ ప్రవేశాల సందడి
- మెండుగా శుభ ముహూర్తాలు

6లో



చొల్లంగి అమావాస్య సందర్భంగా సముద్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు

అల్లవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముని శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన పార్వతీ రామేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సముద్ర తీరంలో వేలాదిగా భక్తులు బుధవారం సముద్ర స్నానాలు ఆచరించారు. చొల్లంగి అమావాస్య సందర్భంగా రామేశ్వరునికి పుల్లేటికుర్తి ఫణిరామహనుమంత్, ఉమాశంకర్ ఆధ్వర్యంలో పండ్ల రసాలతో అభిషేకాలు, పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు చేసి రామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రామేశ్వరంలో చొల్లంగి తీర్థం ఘనంగా జరిగింది. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చొల్లంగి సందర్భంగా రామేశ్వరం అగ్నికుల క్షత్రియుల సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ చైర్మన్ అంగాని రామారావు, అంగాని వర్మ, చక్కా సత్తిబాబు, అంగాని శ్రీను, అంగాడి సత్యశ్రీనివాస్, అంగాడి కాళీ స్వామి, అంగాడి మరిడిస్వామి తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందించారు. పార్వతీ రామేశ్వరాలయం వద్ద ఆలయ నిర్మాణం జాప్యం, చొల్లంగి అమావాస్య రోజున భక్తుల ఏర్పాట్లపై పలువురు భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

మార్చి 3న నేషనల్ లోక్ అదాలత్

అమలాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీన నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జీ, అథారిటీ చైర్మన్ వి.నరేష్ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, బ్యాంకు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ కేసులు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

పీఎం సూర్యఘర్ పథకంతో మేలు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- జిల్లాను పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దాలి
- విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు 'సూర్య ఘర్'
- రాయితీతో ఏర్పాటుకు అవకాశం
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటినీ సూర్యఘర్ వెలుగులతో నింపుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పీఎం సూర్యఘర్ పథకం అమలు తీరు పురోగతిపై నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం తక్షణమే పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో బల్క్ వినియోగదారులను గుర్తించి పథకాన్ని పరిపూర్ణంగా వర్తింప చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో లబ్ధిదారులను కూడా గుర్తించి పథకం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారాలన్నారు. సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచితంగా విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. లబ్ధిదారులు రూ.2 లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఇంటి కప్పుపై ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. మిగిలిన సొమ్మును తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చునన్నారు. లబ్ధిదారులు 10 శాతం వాటా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నాడు. తద్వారా 20 ఏళ్ల పాటు ఉచితంగా సౌర విద్యుత్‌ను పొందవచ్చునని వివరించారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా కాలుష్య రహిత, పర్యావరణ హిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ మాట్లాడుతూ జీఎస్టీ, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వర్తకులతో త్వరలో సమావేశం నిర్వహించి పథకం అమలు తీరుపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షిస్తామన్నారు. సమావేశంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ స్వామినాయుడు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శంకరవరప్రసాద్, ఎల్డీఎం కేశవవర్మ, చీఫ్ సేల్స్ మేనేజర్ నందెపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం..

వీడియో పాఠ్యాంశాలు

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా



వీడియో పాఠ్యాంశాలను ప్రారంభిస్తున్న డీఈవో


అమలాపురం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని అందించడంతో పాటు పాఠ్యాంశాలకు పట్టు సాధించే విధంగా ప్రత్యేక వీడియో క్లిప్పింగ్‌లను రూపొందించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. నిపుణులైన సబ్జెక్టు టీచర్లు రూపొందించిన వీడియో పాఠ్యాంశాల క్లిప్పింగ్‌లను బుధవారం అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి పరీక్షల విభాగం, సబ్జెక్టు నిపుణులు ప్రత్యేకంగా రూపొందించిన వీడియో పాఠ్యాంశాలను పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఉపయోగించి చూపించి వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సబ్జెక్టులో మెలకువలు పొందవచ్చునన్నారు. పాఠ్యాంశాలతో పాటు పట్టికలు, ప్రశ్నపత్రాల విశ్లేషణ వంటివి వీడియో క్లిపింగ్‌ల ద్వారా సిద్ధం చేశామని, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావు తెలిపారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు వీడియో క్లిప్పింగ్‌లు ఎంతగానో దోహదపడతాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం విజయకుమారి, సబ్జెక్టు నిపుణుడు టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, డి.ఉదయం తదితరులు పాల్గొన్నారు.

కుష్టును నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి ప్రాణాంతకమైనది కానప్పటికీ నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంగ వైకల్యం కల్పించగల మహమ్మారి అని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం స్పర్శ కుష్టువ్యాధి ప్రచార వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గతంలో అంతంతమాత్రంగానే ఉన్న కుష్టువ్యాధి తీవ్రత ఇటీవల కాలంలో పెరుగుతున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ అంచనా వేసిందన్నారు. దీంతో అప్రమత్తమైన జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. 14 రోజుల పాటు ఇంటింటా కుష్టు ప్రచార కార్యక్రమం చేపట్టామన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారికి మందులు అందజేస్తూ తరచూగా వారిని పరీక్షించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కుష్టు వ్యాధి పట్ల ఉన్న అపోహలను పూర్తిగా తొలగించాలని చెప్పారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఉచితంగా మందులు పొంది వ్యాధి బారి నుంచి రక్షణ పొందాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



బంగారు పాప ఆలయం, ఆమె రూపం (ఇక్కడే కోరికలు మొక్కుకుంటారు) (కింద)



హిందూ, ముస్లింల ఆరాధ్య దైవం

బంగారు పాప

పొన్నాడలో వచ్చే నెల 7 నుంచి ఉరుస్ ఉత్సవాలకు ముజావర్ల ఏర్పాట్లు

కొత్తపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాప) హిందూ, ముస్లింల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటోంది. మహా శక్తి సంపన్నురాలు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన బంగారు పాపను దేశం నలుమూలల నుంచి అనేక మంది విచ్చేసి మొక్కులు చెల్లించుకుంటారు. బంగారు పాపను ఒకసారి దర్శించుకున్న తర్వాత సంతానం లేని దంపతులకు సంతానం, వివాహం కాని యువతీ, యువకులకు వివాహం జరుగుతుందని ప్రతీతి. దీంతో ప్రతి సంవత్సరం మాఘ మాసంలో మూడు రోజుల పాటు జరిగే బంగారు పాప ఉరుస్ ఉత్సవాలకు భక్తులు పోటెత్తుతారు. బంగారు పాప మహాసంపన్నురాలు కావడంతో పొన్నాడ గ్రామంలో పేదరికంలో ఉండి నీతి, నిజాయితీ కలిగిన కుటుంబాల్లో వివాహ వేడుకలకు బంగారు ఆభరణాలను సమకూర్చేదని, వివాహం అనంతరం తిరిగి బంగారు పాపకు ఇచ్చేవారని ముస్లిం పెద్దలు చెప్తున్నారు. పిఠాపురం పట్టణానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొన్నాడ గ్రామంలో ఎప్పుడో బంగారు పాపకు నిర్మించిన ఏడు అంతస్తుల భవనంలో 6 అంతస్తులు భూమిలో దిగబడి ఉండడం గమనార్హం. కింద అంతస్తులో బంగారుపాపగా భావించే పచ్చరంగు కర్టెన్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి పొన్నాడలో జరిగే ఉరుస్ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు భోజన, వసతి సౌకర్యాలను సమకూర్చడంలో స్థానిక ముజావర్లు నిమగ్నమయ్యారు.



మాఘం... సకల శుభాల మాసం



- నేటి నుంచి పెళ్లిళ్లు, గృహ ప్రవేశాల సందడి
- ఒక్క మాఘ మాసంలోనే సత్యదేవుని సన్నిధిలో సుమారు 600, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల వివాహాలు జరగొచ్చని అంచనా



అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభ కార్యక్రమాలకు ముందుగా గుర్తొచ్చేది మాఘ మాసమే. ఎందుకంటే ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభమైన తర్వాత తరువాత మొదటగా వచ్చే శుభం కలిగే మాసంగా దీనిని పండితులు పరిగణిస్తుంటారు. ఉత్తరాయనం పుష్య మాసంలో వచ్చినా అది శూన్యమాసం కావడంతో శుభ కార్యక్రమాలు చేపట్టరు. గురువారం నుంచి మాఘ మాసం ప్రారంభమవుతుండగా వివాహాది శుభ కార్యక్రమాలు మొదటి రోజు నుంచే ప్రారంభం కానున్నాయి. 30న ప్రారంభమయ్యే పెళ్లిళ్ల సందళ్లు వైశాఖ మాసం వరకు కొనసాగనున్నాయి. అయితే ఒక్క మాఘ మాసంలోనే సత్యదేవుడి సన్నిధిలో సుమారు 600 వరకు వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చాలా పెళ్లి బృందాలు వివాహ వేదికలను బుక్ చేసుకోగా మరికొందరు ఎటువంటి అడ్వాన్సు చెల్లించకుండా అమావాస్య ముగిసిన తర్వాత చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. మాఘమాసంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల పెళ్లిళ్ల జరగొచ్చని అంచనా వేస్తున్నారు. జనవరి 30, 31తో పాటు ఫిబ్రవరి నెలలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో వివాహ ముహూర్తాలున్నాయి. 7, 15, 18, 20, 22 తేదీల్లో ముహూర్తాలు మరింత బలమైనవని పండితులు చెప్తున్నారు. మార్చి నెలలో 8 రోజులు, ఏప్రిల్ నెలలో 12 రోజులు, మే నెలలో 10 రోజులు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయన ముహూర్తాలున్నాయని పంచాంగకర్తలు పేర్కొన్నారు. వరుస శుభ కార్యక్రమాలతో పురోహితులు, సన్నాయిమేళం, క్యాటరింగ్, డెకరేషన్ మండపాలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. వీరు ధరలను అమాంతం పెంచేస్తూ వివాహ బృందాల నడ్డివిరిచేస్తున్నారు.



మెండుగా

శుభ ముహూర్తాలు

కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి



అమలాపురం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం ఎప్పుడు వస్తుందోనని నవ వధూవరులు ఎదురు చూస్తుంటారు. ఆ మాసం రానే వచ్చింది. వివాహాది శుభ ముహూర్తాలు మాఘ మాసంలో మెండుగా ఉన్నాయని బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

వివాహం: ఈ నెల 31, ఫిబ్రవరి 2, 8, 12, 15, 16, 18, 20, 22, 23

శంకుస్థాపన: ఫిబ్రవరి 3, 8, 10, 15, 16, 17, 18, 20.

గృహప్రవేశం: ఈ నెల 31, ఫిబ్రవరి 2, 8, 10, 15, 16, 17, 20

మాఘ మాసంలో ముఖ్య పండుగలు..

ఫిబ్రవరి 2న శ్రీపంచమి, 4న తేదీ రథసప్తమి, 5న భీష్మాష్టమి, 8న భీష్మ ఏకాదశి, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి తీర్థం, 12న మహామాఘి కుంభ సంక్రమణం, 16న సంకష్టహర చతుర్థి, 26న మహా శివరాత్రి, 27న ముమ్మిడివరం బాలయోగీశ్వరుల తీర్థం.

ఫాల్గుణ మాసంలో..

ఫిబ్రవరి 28 నుంచి మార్చి 29 వరకు

వివాహం: మార్చి 1, 2, 6, 7, 12, 14, 15.

శంకుస్థాపన: మార్చి 1, 2, 3, 6, 7, 9, 14, 15

గృహప్రవేశం: మార్చి 1, 2, 6, 7, 9, 14

ముఖ్య పండుగలు..

మార్చి 10న కోరుకొండ తీర్థం, 13న హోళీ, 15న వసంతోత్సవం, 16 నుంచి 29వ తేదీ వరకు శుక్ర మౌఢ్యమి, 30న ఉగాది.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది హాజరు కావాలన్నారు.



మీర్ జవాద్ అలీ కెమెరాతో తీసిన ప్రకృతి సోయగం చిత్రం

ప్రకృతి (చిత్ర) సోయగం

మామిడికుదురు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వర్క్‌షాప్ జరిగింది. పంట కాల్వలో పసుపు రంగు తెరచాపతో ఉన్న పడవలో మత్స్యకారుడు వల విసురుతున్న దృశ్యాన్ని మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మీర్ జవాద్ అలీ అలీ తన కెమెరాలో బంధించాడు. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో రజత పతకం లభించింది.

సత్యదేవుని సన్నిధిలో ఎస్‌పీఎఫ్ ఐజీ



ఎస్‌పీఎఫ్ ఐజీ రామిరెడ్డికి సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి బుధవారం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి విచ్చేశారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఐజీకి వేదపండితులు వేదాశీర్వచనాలు ఇవ్వగా పీఆర్వో స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ భద్రతకు సంబంధించి దేవస్థానం ఎస్‌పీఎఫ్ సిబ్బందికి ఐజీ పలు సూచనలు చేశారు.



కరప మండలం ఉప్పలంకలో తీర్థంలో భాగంగా గరగలు, వీరభద్రుడి ఊరేగింపు



భక్తులతో కిక్కిరిసిపోయిన యానాం జాతీయరహదారి

భక్త 'జనసంద్రం'

- చొల్లంగి తీర్థానికి పోటెత్తిన భక్తులు
- జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రాక
- సముద్ర స్నానాలాచరించి స్వామివారి దర్శనం
- ఏర్పాట్లు చేసిన కమిటీలు

కరప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రాశస్త్యం కలిగిన చొల్లంగి అమావాస్య తీర్థానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కరపమండలం ఉప్పలంక శివారు మొండి గ్రామం విచ్చేసి సముద్ర తీరాన కొలువుదీరిన బాలత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి సముద్ర స్నానాలాచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చొల్లంగిలోని రాజరాజేశ్వరిదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారామాంజనేయ స్వామివార్లను కూడా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప, తాళ్లరేవు, కాజులూరు, తదితర మండలాల నుంచి వీరభద్రుని ప్రభలు, గరగలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అలాగే అప్పన్నెద్దులను కోలసంబరం పాటలు, నృత్యాలతో తోలుకువచ్చి సముద్ర స్నానాలు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, దేవాదాయశాఖ సిబ్బంది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను, వైద్యసేవల కోసం శిబిరాన్ని, తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం నుంచి అప్పనెద్దులకు ప్రవేశం కల్పించగా వాటికి సముద్ర స్నానాలు చేయించి స్వామివారి దర్శించుకున్నారు. సంగమ ప్రదేశం వద్ద జంగమ దేవరులు పలువురిచే పిండ ప్రదానం చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శివపార్వతులకల్యాణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తితో తిలకించారు. కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, ఇంద్రపాలెం, గొల్లపాలెం, కాకినాడ పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీతో యానాం జాతీయరహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలను మళ్లించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మల్లాడి కార్తీక్‌నాయకర్, ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఎంఎస్ఎన్ చార్టీస్ ఈవో కె.విజయలక్ష్మి, ఇతర ఈవోలు మోర్తా మురళీ... రభద్రరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



కరప మండలంలో విశేషాలంకరణలో బాల త్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి



పిండ ప్రదానాలు జరుపుతున్న జంగమ దేవరులు

బ్రహ్మ సమేధ్యంలో...

కాట్రేనికోన, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం సమీపంలోని బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి అమావాస్య వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బ్రహ్మదేవుడు లింగ రూపంలో, కాలభైరవుడు క్షేత్రపాలకుడుగా ఉన్న ఈ పుణ్యక్షేత్రం అత్యంత మహిమాన్వితమైనదిగా భక్తుల నమ్మకం. సంతానార్థులైన మహిళలు రాత్రి సమయంలో గుడి ఆవరణలో నిద్రించి, సంతానం ప్రాప్తికి పూజలు చేశారు. రాత్రి జాగారం తర్వాత భక్తులు సముద్ర స్నానమాచరించి, బ్రహ్మదేవుని దర్శించుకున్నారు. తమ కోర్కెలు నెరవేరిన భక్తులు ఇక్కడ కొబ్బరి మొక్కలు నాటారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పల్లం శ్రీకాలభైరవస్వామి అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగిడి నాగేశ్వరరావు, దాట్ల పవన్, దాట్ల పృధ్వి, చెల్లి అశోక్, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వరరావు, దండుప్రోలు బాలయ్య, మల్లాడి అన్నవరం, అంగాని నరసింహమూర్తి, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



తీర్థంలో గంగిరెద్దుల కోలాహలం



కాట్రేనికోన బ్రహ్మదేవుని ఆలయ ఆవరణలో నిద్రిస్తున్న మహిళలు

వేటూరి పురస్కారం....

నా పూర్వజన్మ సుకృతం

- ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- తుని చిట్టూరి మెట్రోలో అట్టహాసంగా వేటూరి సాహితీ పురస్కార వేడుక
- భారీగా హాజరైన వేటూరి సాహితీ అభిమానులు, ప్రజలు



తునిలో సినీ గేయ రచయిత అశోక్ తేజకు వేటూరి పురస్కారం అందజేసి సత్కరిస్తున్న నిర్వాహకులు

తుని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేలపై వేటూరి సాహితీ పురస్కారం పొందడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తెలిపారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఏటా నిర్వహించే వేటూరి సాహితీ పురస్కార వేడుక తుని చిట్టూరి మెట్రోలో కన్నుల పండుగగా జరిగింది. 14 ఏళ్లుగా నిర్విరామంగా జరుగుతున్న ఈ వేడుకలో పలువురు రచయితలను నిర్వాహకులు ఘనంగా సత్కరిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది సినీ గేయ రచయిల సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రముఖులు, వేటూరి సాహితీ అభిమానుల మధ్య నిర్వాహకులు సుద్దాల అశోక్‌తేజకు వేటూరి పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గేయ రచయిత సుద్దాల అశోక్ మాట్లాడుతూ వేటూరి వంటి మహనీయులు జయంతి వేడుకను తునిలో ఇంత వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఇది సాహిత్యానికి ఇస్తున్న గౌరవంగా ఆయన అభివర్ణించారు. వేటూరి వంటి మహనీయులను అభిమానించడం అంటే అక్షరాలను పూజించడం ఆరాధించడం అన్నారు. కవులు ఉన్నంత కాలం తెలుగు భాష వైభవం తగ్గదని 1994లో సినీ రంగంలోకి ప్రవేశించానని, ఎన్నో పాటలు ప్రయోగాలతో నేటికీ 3000 పైబడి పాటలు రచించానన్నారు. తన తండ్రిలో ఉన్న విప్లవ పదజాలం ఆత్రేయ గారి సరళి వలనే తన పాటలకు ప్రత్యేకమైన గుర్తింపని, వేటూరి వంటి మహనీయులు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సినీ దర్శకుడు శేఖర్ కమ్ములతో కలిసి సాహితీ అభిమానులు 150 పుస్తకాలతో సుద్దాల అశోక్‌తేజను ఘనంగా సత్కరించారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ ఈ పురస్కారానికి అర్హులని, ఈ వేడుకలో పాలుపంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పిల్లలు వేటూరి పాటలు వింటే సాహిత్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ వేటూరి సాహితీ పీఠం ద్వారా ప్రతిఏటా పురస్కారాలు ప్రదానం చేయడం వేటూరికి తాము ఇచ్చే నివాళిగా భావిస్తున్నామన్నారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మతో పాటు తుని, పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు, వేటూరి అభిమానులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునికీకరణకు రూ.19.37 కోట్లు

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా ఆధునికీకరణకు రాష్ట్రప్రభుత్వం రూ. 19.37 కోట్ల నిధులు మంజూరు చేసిందని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులతో గోదావరి డెల్టాలో 122 పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన రెండో అసెంబ్లీ సమావేశాన్ని గోదావరి డెల్టా ఆధునికీకరణపై తాను లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పందించిందన్నారు. ఈ నిధులతో గోదావరి డెల్టాలో పంట కాలువలు, మురుగునీటి కాలువలను శుభ్రం చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం మళ్లీ గాడిలోకి తేస్తుండడంతో రైతులకు ఊరట కలగనుందన్నారు.

ప్రేమ పేరుతో మోసగించి.. వ్యభిచార వృత్తిలోకి దింపి..

- పెద్దాపురంలో బాలికకు నరకం చూపించిన తల్లీకొడుకు
- అచేతన స్థితికి చేరుకున్న బాధితురాలు
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలికకు ప్రేమ పేరుతో వల వేసి ఆపై పెళ్లి పేరుతో మోసగించి వ్యభిచార వృత్తిలోకి దింపి నరకం చూపించారు ఓ తల్లికొడుకు. దీంతో బాలిక అచేతన స్థితికి వెళ్లింది. ఈ ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురంలో వెలుగుచూసింది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే..

స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చందు అనే యువకుడు అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి ఆపై పెళ్లి పేరుతో వంచించి పెద్దాపురం తీసుకు వచ్చాడు. కొన్నిరోజులు గడిచాక తల్లీ నీలిమ, కొడుకు చందూ డబ్బుపై ఆశతో బాలికకు తమ విశ్వరూపాన్ని చూపించారు. వ్యభిచారం చేయాలంటూ వేధించడం ప్రారంభించి నిత్యం బాలికకు నరకం చూపించారు. బలవంతంగా బాలికతో వ్యభిచారం చేయించారు. దీంతో బాలిక అనారోగ్యం పాలయ్యింది. అలాగే కొన్ని రోజులకు ఆమె శరీరంలో ఇన్‌ఫెక్షన్ రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీతో చికిత్స చేయించారు. బాలికకు రకరకాల మందులను వాడించి నానాహింసలకు గురి చేశారు. తల్లీ కొడుకులు పెట్టే బాధలు తాళ లేక గతేడాది డిసెంబరు 28న చీమల మందు తాగి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే బాలికకు చేతులు, కాళ్లు వంకర్లు పోయి కదలేక అచేతనంగా ఉండిపోయింది. కాకినాడ చేరుకున్న బాలిక తల్లి దండ్రులు విశాఖ విమ్స్‌కు తీసుకువెళ్లి చికిత్స అందించారు. బాలిక మానసిక స్థితి కూడా తేడా రావడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులైన తల్లీకొడుకుపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసిన నిందితులు పరారీ కావడంతో పోలీసులు ముమ్మరంగా గాలించి అరెస్ట్ చేశారు.

పోక్సో కేసు నమోదు

మైనర్ బాలికతో నిర్బంధ వ్యభిచారం చేయించిన కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుమారు 6 నెలల క్రితం బాధిత మైనర్ బాలికకు పెద్దాపురానికి చెందిన ధరణికోట చందు అనే యువకుడితో ప్రేమ వివాహం జరిగిందన్నారు. బాలికను ఆమె అత్తగారు వ్యభిచారం చేయమని ప్రోత్సహించినట్టు, డ్రగ్స్ ఇచ్చి ఇబ్బంది పెట్టినట్టు పోలీసులకు తెలియచేయలేదన్నారు. ఈనెల 25న పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు వైజాగ్ విమ్స్ ఆసుపత్రి నుంచి వచ్చిన బాధిత బాలిక తల్లి వచ్చి ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఈనెల 26న కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే నిందితుడు చందుపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని, మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు. ఈ కేసు విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని తెలిపారు. సమావేశంలో సీఐ ఏ.కృష్ణ భగవాన్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీ

▸ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ▸ కాకినాడలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశం


కాకినాడలో లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీని తీసుకొచ్చి అమలు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కాకినాడలో స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్‌లో బుధవారం రాత్రి ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. 26 జిల్లాల నుంచి పలు హోటళ్ల యజమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టూరిజం శాఖకు ఇండస్ట్రీ హోదా ఇస్తున్నామన్నారు. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ ఇస్తామని హామీ ఇచ్చారు. హోటల్ ఇండస్ట్రీస్ పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటల్ ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్లాలని, ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం పరిష్కారం చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆలోచనతో టూరిజం అభివృద్ధికి సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ఏపీలో సింగిల్ విండో విధానంలో టూరిజం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రత్యేకమైన టూరిజం పాలసీ ద్వారా రిసార్ట్స్, హోటల్స్ ఇతర నిర్మాణాలు, వివిధ విభాగాలను అభివృద్ధి చేస్తామన్నారు. టెంపుల్ టూరిజం కూడా అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకుల సందర్శనలో వారికి సౌకర్యాలు కల్పించడంలో హోటళ్ల పాత్ర చాలా కీలకంగా ఉందని మంత్రి తెలిపారు.

హోటళ్లకు విద్యుత్ రాయితీలు

పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ టూరిజాన్ని ఒక పరిశ్రమగా తీసుకుని వస్తున్నామని, హోటళ్లకు విద్యుత్ రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే హోటళ్లకు రాయితీలు ఇచ్చేలా టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మంచి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. టూరిజం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయనుందన్నారు. పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. హోటళ్లలో సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి మాట్లాడుతూ టూరిజంశాఖ ద్వారా హోటళ్ల నిర్వహణకు అవసరమైన తోడ్పాటును అందజేయాలని మంత్రిని కోరారు. టూరిజం డెవలప్మెంట్ కమిటీలో హోటల్ మేనేజ్మెంట్‌ను కూడా చేర్చాలని, లైసెన్స్ ఫీజులను రద్దు చేయాలని కోరారు.

కౌడా నుంచి పూర్తి సహకారం

కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ టూరిజంపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టితో ఉన్నారన్నారు. రాష్ట్ర పర్యటక రంగాన్ని, హోటల్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కౌడా నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. హోటల్ మేనేజ్మెంట్ రంగానికి సహకారం అందిస్తామన్నారు. ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(టీడీసీ) ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఏపీలో టూరిజం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, సంపద సృష్టికి టూరిజం పాలసీని కూడా తీసుకొచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకీ రెసిడెన్సీ ఎండీ మూర్తి, హోటళ్ల యజమానుల అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

సముద్ర స్నానం చేస్తూ వ్యక్తి మృతి


మృతిచెందిన వెంకటసుబ్బారావు

అల్లవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చొల్లంగి అమావాస్య సందర్భంగా సముద్ర జలాల్లో పుణ్యస్నానాలు చేస్తూ వ్యక్తి మృతి చెందిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో బుధవారం ఉదయం జరిగింది. అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన బొడ్డు వెంకటసుబ్బారావు (45) ఎస్.రామేశ్వరంలో సముద్ర స్నానానికి దిగి పెద్ద అలకు కొట్టుకుపోయి మృతిచెందాడు. అన్నను రక్షించే ప్రయత్నంలో బొడ్డు రమేష్ సముద్రంలో మునిగిపోతుండగా స్థానికులు దిగి రమేష్‌ను ఒడ్డుకు చేర్చారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు రామేశ్వరం వచ్చిన అన్నదమ్ములిద్దరూ 8 గంటల ప్రాంతంలో ఎవరూలేని చోట స్నానానికి దిగగా పెద్ద కెరటానికి కొట్టుకుపోయి అన్న వెంకటసుబ్బారావు మృతిచెందగా తమ్ముడు రమేష్‌ను స్థానికులు రక్షించారని పోలీసులు తెలిపారు. వెంకటసుబ్బారావు నేదునూరులో పాన్‌షాపు నడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్‌లు ప్రమాద స్థలిని సందర్శించారు. వెంకట సుబ్బారావు మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వాకింగ్‌కు వెళ్లి.. శవమై కనిపించి..!

పందలపాకలో వివాహిత అనుమానాస్పద మృతి


లలితేశ్వరి మృతదేహం

బిక్కవోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. కురుపూడి లలితేశ్వరి (33) స్థానిక సంచుల గొడౌన్లో గుమస్తాగా పనిచేస్తోంది. రోజువారీ దినచర్యలో భాగంగా బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు బయటకు వెళ్లింది. అయితే ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త రాజు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులకు సమాచారమిచ్చాడు. వారంతా వచ్చి వెతకగా ఆమె పనిచేస్తున్న సంచుల గొడౌన్లో శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ముఖంపై గాయాలు, రక్తపు మరకలు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్ఐ వీ.రవిచంద్ర కుమార్ తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించ గా, అవి సంఘటనా స్థలం నుంచి గ్రామంలోని జెండా పంజా సెంటర్ వరకు వచ్చి ఆగిపోయాయి. ఈస్ట్‌జోన్ డీఎస్పీ బీ.విద్య, అనపర్తి సీఐ సుమంత్ వచ్చి పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్టు

600 గ్రాముల గంజాయితో పాటు మోటారుసైకిళ్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సావరం బైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారాన్ని పట్టణ సీఐ పి.వీరబాబు అందుకున్నారు. వెంటనే పట్టణ ఎస్ఐ టి.తిరుమలరావు ఆధ్వర్యంలో సిబ్బంది సావరం బైపాస్ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఆరుగురు యువకులు గంజాయి సేవిస్తున్నట్టు గుర్తించారు. అమలాపురం ఇన్‌చార్జి తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్ సమక్షంలో ఫ్రెంచి యానానికి చెందిన కనపర్తి వెంకటదుర్గ అలియాస్ దుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజులు, సాపే వంశీ, కర్రి దుర్గాప్రసాద్, అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన బొంతు నవీన్‌కుమార్, నల్లమిల్లికి చెందిన కోటిపల్లి నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి, నాలుగు మోటారుసైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసినవారిని అమలాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. గంజాయి రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వీరబాబు తెలిపారు.

నేటి నుంచి కాకినాడ ఐటీఐలో బ్రిడ్జి కోర్సు ప్రారంభం

కన్వీనర్ వేణుగోపాల వర్మ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు సిద్ధం చేయడానికి బ్రిడ్జి కోర్స్ తరగతులు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల జిల్లాల కన్వీనర్ ఎం వేణుగోపాల వర్మ తెలిపారు. ఈ నెల 30 నుంచి ఈ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పదవ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన ధృవీకరణ పత్రాల జెరాక్స్ కాపీలను తీసుకుని నేరుగా కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో సంప్రదించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 87907 98431, 94946 88516లలో సంప్రదించాలన్నారు.

5 నుంచి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు జరగనున్నాయి. 9వ తేదీ వరకూ జరిగే నాటికల పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వివిధ నాటక సమాజాల కళాకారులు వచ్చి నాటికలు ప్రదర్శిస్తారని కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు చిగురు మేఘం నాటిక, విశాఖపట్టణం తెలుగుకళాసమితి కళాకారులు నిశ్శబ్ధమా నీ ఖరీదెంత నాటిక, 6వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవిందా ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు జనరల్ భోగీలు, 7వ తేదీన హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు మూల్యం నాటిక, కట్రపాడు ఉషోదయ నికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటిక, 9వ తేదీన పొన్నూరు రసఝురి కళాకారులు గురితప్పిన వేట నాటికలను ప్రదర్శిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు


వాకాడలో విచారణ చేపడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, సీడీపీవో

కరప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి డీఈవో, ఎంఈవోలకు ఫోన్ చేసి విచారణ చేపట్టి వెంటనే అతన్ని విధుల నుంచి తొలగించాలని సూచించారు. దీంతో ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ వాకాడలోని ఎంపీపీ స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. వారిచ్చిన ప్రాథమిక నివేదికను అనుసరించి లైంగిక వేధింపులకు పాల్పడిన వీఎస్.రామారావును సస్పెండ్ చేస్తూ డీఈవో ఆదేశాలు జారీచేశారు. అలాగే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ కాకినాడ ప్రాజెక్టు సీడీపీవో యాసరపు లక్ష్మి బుధవారం సాయంత్రం వాకాడ ఎంపీపీ పాఠశాలకు వెళ్లి బాధిత బాలికతో బాటు సహచర విద్యార్థినులు, వారి తల్లులను విచారించారు. ఉపాధ్యాయుడు రామారావు చేసిన అకృత్యాలు, వికృత చేష్టలను బాధిత బాలికతో బాటు మరో నలుగురు బాలికలు పూసగుచ్చినట్టు చెప్పారు. బాలికలు, వారి తల్లులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా రూపొందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే పంతం నానాజీ లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు అండగా ఉండి పూర్తి న్యాయంజరిగేలా చూస్తామని తెలిపారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్



సర్పవరం జంక్షన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్‌ను ప్రభుత్వం నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమాండెంట్‌గా ఉన్న ఐపీఎస్ ఎం దీపిక బదిలీ కావడంతో ఆమె స్థానంలో అక్టోపస్ కమాండెంట్‌గా పనిచేస్తున్న నాగేంద్రకుమార్‌ను ఏపీఎస్పీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో ఇక్కడ అదనపు కమాండెంట్‌గా పనిచేశారు.

'ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలి'

సామర్లకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు శిక్షణా తరగతులను పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల మండలాలకు చెందిన రెండవ బ్యాచ్ పంచాయతీ కార్యదర్శులకు ఈటీసీ ఆవరణలో అందిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 5 జిల్లాలకు చెందిన ఆయా పంచాయతీ కార్యదర్శులు సుమారు 67 మంది హాజరయ్యారు. ఫిబ్రవరి 8 వరకూ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామనాథం, ఫ్యాకల్టీలు తదితరులు ఉన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కొండచిలువలు వచ్చాయి!

మల్లేపల్లి జాతీయ రహదారిపై హల్‌చల్

గండేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. జాతీయ రహదారి దాటేందుకు రోడ్డు మధ్యలోకి రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. అటుగా వెళుతున్న వాహనాలు దానిపై నుంచి వెళ్లడంతో చనిపోయింది. దాని పొడవు సుమారు ఆరున్నర అడుగులు ఉంటుందని స్థానికులు తెలిపారు. అయితే గతంలో ఇదేచోట హైవే పక్కన వరి పొలంలో ఏడున్నర అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు.


గండేపల్లి జాతీయ రహదారిపై చనిపోయిన కొండచిలువ

గిడజాంలో..

రౌతులపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 అడుగుల కొండచిలువను గ్రామస్థులు చంపేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పిల్లలు కొబ్బరి మొక్కలకు నీళ్లు పోస్తుండగా బాత్ రూమ్ వద్ద కొండచిలువ ఉండ డంతో ఉపాధ్యాయులుకు తెలియజేశారు. ఉపాధ్యాయులు గ్రామస్తులు దృష్టికి తీసుకెళ్లగా కొండచిలువను హతమార్చారు. అయితే పాఠశాల పైనే కొండ ఉండడంతో కొండ చిలువ వచ్చి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు.


గిడజాంలో హతమార్చిన కొండచిలువ

ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్ట్ మృతదేహం కాలువలో లభ్యం



సలీం మృతదేహం, ఫైల్ ఫొటో

సామర్లకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న పెదపూడికి చెందిన జర్నలిస్టు షేక్ సలీం(40) మృతదేహం 20 రోజుల అనంతరం సామర్లకోట కాలువలో లాకులు సమీపంలో తూటికాడ డెక్కలలో చిక్కుకుని ఉండడాన్ని బుధవారం సాయంత్రం సామర్లకోట పోలీసులు గుర్తించారు. దుస్తుల ఆధారంగా సలీం మృతదేహంగా పోలీసులు గుర్తించి పెదపూడిలో ఉన్న సలీం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 9న సాయంత్రం సామర్లకోట రైల్వే గేటు సమీపంలో ఉన్న నూతన వంతెన పైనుంచి కాలువలోకి సలీందూకి ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు గజ ఈతగాళ్లతో చేపట్టినా ఫలితం లేకపోయింది. బుధవారం సలీం మృతదేహన్ని పోలీసులు గుర్తించి గట్టుకు చేర్చారు. సుమారు 20 రోజులు పాటు నీటిఅడుగు భాగంలోనే మృతదేహం ఉండిపోవడంతో గుర్తుపట్టలేని రీతిలో డీకంపోజ్ అయ్యిందని అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కృష్ణభగవాన్ తెలిపారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో ఈనెల 14వ తేదీన స్కూటీపై వెళుతున్న మహిళను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఆమె రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసు పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై అనపర్తి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన కర్రి అలేఖ్య ఈనెల 14న స్కూటీపై రామవరం నుంచి అనపర్తి వెళ్తుండగా పొలమూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. దవడ, ఎడమ చేతి ఎముకలు విరిగిపోయాయి. స్థానికుల సహకారంతో ఆమెను అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు రాజమహేంద్రవరం తరలించారు. స్కూటీని ఢీకొన్న వాహనం వివరాలు తెలియరాలేదు. అలేఖ్య భర్త పేర్రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురంలో పురూలియా చౌ

పిఠాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కళ్లెదుటే సన్నివేశాలు జరుగుతున్నట్టు నృత్యాభియం, కళ్లప్పగించి చూసేలా కదలికలతో పురూలియా చౌ నృత్యప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో పీఠికాపుర కళావేదికపై బుధవారం రాత్రి పశ్చిమబెంగాల్ సంప్రదాయ నృత్యకళారూపకం పురూలియా చౌ నృత్య ప్రదర్శన నిర్వహించారు. పురాణాల నుంచి వచ్చిన సన్నివేశాలను తీసుకుని మహిషాసుర మర్దిని, అభిమన్యు వధలను ప్రదర్శించారు. గౌర్‌కుమార్, విశాల్ చంద్రకుమార్, గణేష్ చంద్రకుమార్, స్వపన్ మహతో, పీలే మాచౌర్, రోహిన్, అక్షయ్, ఠాకూర్ దాస్‌కుమార్, హర్షభర్ధన్ కుమార్, రంపాడ కలిండి, లొడ్జో మ్యూరింగ్, రాజారామ్ ఓరస్, అర్జున్ మాచౌర్ తదితర కళాకారులు ప్రదర్శన ఇచ్చారు.


పిఠాపురంలో నిర్వహించిన పురూలియా చౌ నృత్య ప్రదర్శన దృశ్యాలు

సూరీడు.. సూపర్!

కాకినాడలో బుధవారం సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిన దృశ్యాలు

ఫొటోగ్రాఫర్, కాకినాడ





పశువైద్య శిబిరం

మలికిపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గూడపల్లిలో పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ సుందర బ్రహ్మయ్య ప్రారంభించారు. డాక్టర్ పి.సూర్యనారాయణరాజు 60పశువులకు గర్భనిర్ధారణ, 160ఆవులు, గేదెలకు పరీక్షలుజరిపి మందులు అందించారు. పున్నం గంగారావు, సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

అంతర్వేది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీ నరసింహస్వామిని బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ దర్శించుకున్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, మండలపార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణుక్య, కాపిశెట్టి కనకేశ్వరరావు పాల్గొన్నారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



3వ వార్డులో సమస్యలపై

ప్రజాగళం

అమలాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే ఎజెండాగా' పేరుతో మంగళవారం అమలాపురం మూడో వార్డులో నిర్వహించిన చర్చా వేదిక విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. అధిక సంఖ్యలో వచ్చిన వార్డు ప్రజలు ఎన్నో సమస్యలను నేతలు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బుధవారం నాటి సంచికలో అనేక అభిప్రాయాలు ప్రచురించగా, చర్చా వేదికలో మరికొందరు వ్యక్తం చేసిన జనాభిప్రాయాలివి...

మలేరియా డిపార్ట్‌మెంట్ వారు కనిపించడంలేదు



నాలుగేళ్లగా మలేరియా డిపార్టుమెంటుకు చెందినవారు కనిపించడం లేదు. వాళ్లు ఏమైపోయారో తెలియదు. ఎలా ఉంటారో తెలియదు. గతంలో ఆ శాఖవారు దోమల నివారణ మందు స్ప్రే చేసేవారు. ప్రస్తుతం డ్రైన్లు అధ్వానంగా ఉన్నాయి. దోమల బెడద విపరీతంగా ఉంది. మలేరియా డిపార్టుమెంటు వారు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారిని వార్డుల్లోకి పంపించాలి. వార్డులో మూడు చోట్ల రోడ్లపై కొండల్లా వేసిన స్పీడు బ్రేకర్లపై కుటుంబ సమేతంగా మోటారు సైకిళ్లపై వెళితే ఇక నేరుగా ఆసుపత్రిలో చేరాల్సిందే.

వలవల శివరావు, కల్వకొలనువీధి

యంత్రాంగం కదిలింది..

యేడిద శ్రీను, జనసేన మున్సిపల్ ప్రతిపక్ష నేత, 3వ వార్డు కౌన్సిలర్



చర్చావేదికలో ప్రస్తావించిన కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు ముందుకు వచ్చారు. వాటిలో భాగంగా వార్డుల్లో వివిధ ప్రాంతాల్లో కొండల్లా ఉన్న స్పీడు బ్రేకర్లను తొలగించడానికి ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రైన్లలో కుళాయి నీటిని పట్టుకుంటున్న వారి ఇళ్ల వద్ద ప్రత్యేక ప్లాట్‌ఫారంలు సిద్ధం చేయడానికి చర్యలు చేపట్టారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి అధికారులు నడుం బిగించారు.

అంగన్‌వాడీ చుట్టూ తిరగాల్సి వస్తోంది



అంగన్‌వాడీ కేంద్రం ఎక్కడో జనుపల్లి గ్రామం సమీపంలో ఉంది. పాల ప్యాకెట్లు, కోడిగుడ్ల కోసం పలు పర్యాయాలు తిరగాల్సి వస్తుంది. పిల్లలను ఎలాగో పంపించలేకపోతున్నాం. కనీసం సకాలంలో అయినా పౌష్టికాహారం అందించేందుకు అన్నీ ఒక్కసారి ఒకేరోజు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలి. బోడసకుర్రులో రూ.లక్ష చెల్లించి టిడ్కో ఇళ్ల తీసుకున్నాం. ఇప్పుడు నెలసరి వాయిదాలు కట్టాలని బ్యాంకులు వేధిస్తున్నాయి. కూలి పని చేసుకుని బతికేవాళ్లం. వాయిదాలు ఎలా చెల్లించేది??.

దున్నాల సత్తిబాబు, 3వ వార్డు

మురుగునీటి డ్రైన్ వెడల్పు చేయాలి



ఎప్పుడో వేసిన సీసీ డ్రైన్లు..ఇప్పుడు జనాభా పెరిగారు. డ్రైన్లు మాత్రం అలాగే ఉన్నాయి. సీసీ రోడ్లుతో పాటు వెడల్పుగా డ్రైన్లు వేయాలి. ప్రమాదభరితంగా మారిన స్పీడు బ్రేకర్లను పూర్తిగా తొలగించి ప్రమాదాలు నివారించాలి. ఈ స్పీడ్ బ్రేకర్లు మంచి కన్నా చెడే ఎక్కువ చేస్తున్నాయి. వీధిలో కుక్కల బెడద గురించి చెప్పలేం. పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు సైతం భయపడుతున్నారు. ఒక్కోసారి పిల్లల కోసం రోడ్డు దాటేవరకు వారికి కాపలాగా ఉండాల్సి వస్తుంది.

కేవీ ప్రభాకరశర్మ, బ్రహ్మానందం వీధి

ఖాళీ స్థలాలతో ఇబ్బందులు



ఇళ్లు పాడైపోయింది. దానికి తోడు చుట్టూ ఖాళీ స్థలాలు. అక్కడ ఏవిధమైన కట్టడాలు కట్టడం లేదు. ఖాళీ స్థలాలు పాములు, పందులకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. దాంతో అక్కడ ఉండలేక అద్దె ఇంట్లోకి వెళ్లిపోయాం. స్థలం చూపిస్తాం. ఇల్లు కట్టుకునేందుకు గృహనిర్మాణ రుణం ఇప్పించాలి. పాములు, పందుల బెడద నివారించాలి. లేకపోతే ఇక్కడ జీవించడం చాలా కష్టం. అధికారులు ఈ విషయమై చొరవ తీసుకుని మా కష్టాలు తీర్చాలి.. పాముల నుంచి మాకు రక్షణ కల్పించాలి..

పోతురాజు సత్యవతి, 3వ వార్డు

తాగునీరు సక్రమంగా రావడం లేదు



వార్డులోని పలు ప్రాంతాల్లో రక్షిత మంచినీరు సక్రమంగా అందడం లేదు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దానికి తోడు తాగునీటిలో డ్రైనేజీ వాటర్ కలిసిపోయి కలుషితమవుతోంది. ఒక్కోసారి నీళ్లు తాగలేని పరిస్థితి. సక్రమంగా తాగునీరు అందించాలి. రోడ్లపై ఇష్టానుసారంగా పశువులను వదిలేస్తున్నారు. దీనివల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి కూడా చనిపోయాడు. వాటిని నివారించాలి..

రంబాల లక్ష్మి, 3వ వార్డు

డ్రైన్లపై పలకలు వేయడం లేదు..



వార్డులోని ప్రధాన డ్రైన్‌ను శుభ్రం చేసేటప్పుడు కాంట్రాక్టరు వాటిపై పలకలు తీసి పక్కన పడేస్తున్నారు. ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఏడాది తరువాత తిరిగి ఆ బల్లలను వేస్తున్నారు. ఈసారి శుభ్రం చేసేందుకు వస్తే తిరిగి పలకలు వేసేలా ఉంటేనే ముట్టుకోనిస్తాం. చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో జనం వాసన భరించలేక కూర్చోవడానికి కూడా భయపడుతున్నారు. మున్సిపల్ పారిశుధ్య అధికారులు చర్యలు తీసుకోవాలి..

అడబాల దుర్గారావు, 3వ వార్డు

విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నాం



పెరిగిన జనాభాను బట్టి ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తగా ఏర్పాటు చేయాలి. విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సార్వత్రిక ఎన్నికల వేళ ఓట్లు అడిగేందుకు వచ్చిన నాయకులకు సైతం అప్పుడు చెప్పాం. ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తగా ఏర్పాటు చేసి వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా నివారించాలి. లేకపోతే ఈ వేసవిలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది..నాయకులు, అధికారులు సమస్యను గుర్తించాలి

తిరుమనాథం సత్యవేణి, 3వ వార్డు

డ్రైన్‌లో నీరే మాకు తాగునీరు!



కుళాయిల ద్వారా వచ్చే తాగునీటిని డ్రైన్‌లో పట్టుకోవాల్సిన దుస్థితి. అదే డ్రైన్‌లోకి నేరుగా లెట్రిన్ గొట్టాలను విడిచి పెట్టేస్తున్నారు. చెండాలంగా మారిపోయింది. అసలే తాగునీటి సమస్య. దానికితోడు కంపులోనే.. ఆ వచ్చే నీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి. డ్రైన్‌లో మురుగునీరు ముందుకు పారేలా చేసి మంచినీటి కుళాయిని ఎత్తైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలి. మాకు వచ్చే తాగునీరు ఇంత దారుణంగా ఉంటున్నా పరిష్కారం దొరకడం లేదు. అధికారులు ఇప్పటికైనా పరిష్కరించాలి..

చింతలపూడి అనంతలక్ష్మి, కల్వకొలనువీధి

రూ.40కోట్ల విద్యుత్ పనులు పూర్తి: ఎమ్మెల్యే



లక్కవరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలో రూ.40కోట్ల విలువైన విద్యుత్ పనులను పూర్తి చేశామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుడిమెళ్లంక వాటరు స్కీముకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ లైనును ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గుడిమూల సబ్‌స్టేషన్‌కు నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామని, గుడిమెళ్లంక విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు కూడా అనుమతి రాగానే పూర్తి చేస్తామన్నారు. ఎస్ఈ రాజబాబు మాట్లాడుతూ గుడిమూల సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అన్ని అనుమతులు లభించాయని, గుడిమెళ్లంక సబ్‌స్టేషన్‌కు కూడా స్థలం ఇవ్వడం జరిగిందని, అనుమతులు రాగానే ముందుకు వెళతామన్నారు. కార్యక్రమంలో డీఈటీ విజయానంద్, డీఈ రవికుమార్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ బొలిశెట్టి ప్రసాద్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్ కోట పుష్పకుమారి, మంగెన నాని, మల్లిపూడి సత్తిబాబు, చెల్లింగి సత్యనారాయణ, అంతర్వేది దేవస్థానం ఉత్సవకమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఉంగరాల బాలాజీ, దేశినీడి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్య లేకుండా చూస్తా

అంతర్వేది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో లోఓల్టేజ్ సమస్య లేకుండా చూస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి, అంతర్వేది సబ్‌స్టేషన్లలో నూతన కొత్త ఫీడర్లను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో విద్యుత్, తాగునీటిపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రూ.40కోట్లతో రాజోలు నియోజకవర్గంలో విద్యుత్ సంబంధిత పనులు జరిగాయన్నారు. అలాగే గుడిమూల గ్రామంలో, గుడిమెళ్లంక గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు రానున్నాయన్నారు. సఖినేటిపల్లి, అంతర్వేది, లక్కవరం సబ్‌స్టేషన్లకు సంబంధించి రూ.8 కోట్లతో 11కేవీ ఫీడర్లను ఏర్పాటుచేసి సఖినేటిపల్లి గ్రామానికి లోఓల్టేజ్ సమస్య లేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజబాబు, డీఈటీ విజయానంద్, ఏడీ శ్రీనివాస్, ఏఈ ప్రసాద్, ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, ఆకనబాబ్జినాయుడు, గుబ్బల ఫణికుమార్, తాడి మోహన్‌కుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, రావూరినాగు, గంటా నాయుడు, గొల్లమందల చిట్టిబాబు, లక్కు సత్యనారాయణ, పోతురాజు నానాజీ, ఉండపల్లి అంజి, చొప్పల బాబూరావు, ఏసీ వి.సత్యనారాయణ, కొండా కిశోర్, విద్యుత్ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి కుటుంబం రూ.8లక్షల కోట్లు కొల్లగొట్టారు

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి కుటుంబం తమ విలాసాలకు, జల్సాలకు రూ.19.87కోట్లు ప్రభుత్వ ధనాన్ని దుబరా చేసిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని కమీషన్ల రూపంలో జగన్‌రెడ్డి రూ.8లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో రూ.10లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్రాన్ని పాతాళానికి తొక్కేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్ దివాలా తీసేలా చేశారని ఆయన మండిపడ్డారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బూత్ కమిటీలు భారీగా నియమించిన నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నామన రాం బాబు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవేంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, మొల్లేటి శ్రీను, జాలెం శ్రీనివాస రాజా, దంతులూరి శ్రీనురాజు, ఆరుమిల్లి లాల్ బాబు, సుదా బాబ్జి, యడ్ల ఏసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ఏఎంసీ పదవి టీడీపీకి కేటాయించాలి

మామిడికుదురు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవి తెలుగుదేశం పార్టీ వారికే కేటాయించాలని ఆ పార్టీ మండల నాయకులు బుధవారం పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ టూమెన్ కమిటీ సభ్యుడు జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబుకు వినతిపత్రం అందించారు. చైర్మన్ పదవిని పార్టీలో చాలా సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్న చుట్టుగుళ్ల దుర్గావతికి కేటాయించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, సర్పంచ్ సుందరనీడి చిన్నీ, ఈలి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, మల్లాడి విష్ణు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

పి.గన్నవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అత్తమామలు వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఊడిమూడి గ్రామానికి చెందిన చికిలే సౌజన్య ఫిర్యాదు చేసింది. సౌజన్యకు అయినవిల్లి మండలం యలక్లంకకు చెందిన పాము రాజుకుమార్ అలియాస్ వరప్రసాద్‌తో 2023లో వివాహమైంది. రూ.4.50లక్షలు, ద్విచక్రవాహనం కట్నంగా ఇచ్చారు.. అదనపు కట్నం కోసం భర్త, అత్త, ఆడపడుచులు, మరిది శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొంది. ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ తగ్గించాలి'

అమలాపురం టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ యాజమాన్యం తీసుకువచ్చిన మార్పులతో జరుగుతున్న నష్టాలను వివరిస్తూ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా అమలాపురం శాఖ ఆధ్వర్యంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ తగ్గించడంతో పాటు ఏజెంట్లకు తగ్గించిన కమీషన్‌ను పెంచాలని, ఒక ఏజెంట్ చేసిన పాలసీని వేరొక ఏజెన్సీకి బదిలీ చేయడాన్ని రద్దు చేయాలని, గ్రూపు టర్మ్ ఇన్సూరెన్స్ వయసు పెంచి ఏజెంట్స్ ఇన్సూరెన్సు కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు ఆధ్వర్యంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గుమ్మలూరి వినాయకరావు, కోశాధికారి దొమ్మేటి శివస్వామి, అధికారి బాబ్జి, కోరుమిల్లి మధు, మట్ట దుర్గాశ్రీనివాస్‌గౌడ్, కేతా వీరాస్వామి, కడలి శ్రీనివాసరావు, శీలం లంకేశ్వరుడు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.13.58లక్షలు

అమలాపురం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయ శాఖ తనిఖీదారు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.13,58,335 ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. రెండు నెల ల 9రోజులకు ఈఆదాయం వచ్చిందని చెప్పారు. హుండీల లెక్కింపులో ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, సభ్యుడు మోకా వెంకట సుబ్బారావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

అంబాజీపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రహదారులు నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తామని సర్పంచ్ పితాని మంగా దేవివీరాస్వామి అన్నారు. నందంపూడిలో ఆనిశెట్టివారిపాలెం, విప్పర్తివారిపాలెంలో 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా నిర్మించే రహదారికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నేదునూరి మురళీకృష్ణ, మందా వెంకటేశ్వరరావు, కేతా అర్జునుడు, బెండా శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

అంబాజీపేట,జనవరి29(ఆంధ్రజ్యోతి): రెండుకారులు ఢీకొనడంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. మొసలపల్లి ప్రధానరహదారిలో అమలాపురం నుంచి ముక్కామల వైపువెళ్తున్న కారు, ముక్కామల నుంచి అమలాపురం వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. రెండు కార్లలో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. ఎటువంటి కేసు నమోదు కాలేదు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో అనుసంధానంగా ఉన్న ఫీడర్ల ప్రాంతంలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులపై ట్రీ కటింగ్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ హైస్కూల్ ఫీడర్, పేరూరు ఫీడర్, రా వాటర్ ఫీడర్, బండారులంక ఫీడర్, ఇందుపల్లి ఫీడర్లతో పాటు 11కేవీ ఎర్రవంతెన ఫీడర్ ప్రాంతాల్లో చేపట్టే పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈదరపల్లి, ఆర్టీసీ బస్టాండు సెంటర్, మార్కెట్ ఏరియా, గడియార స్తంభం సెంటర్, మున్సిపల్ సర్క్యులర్ బజార్, ముమ్మిడివరం గేటు, నారాయణపేట, కె.అగ్రహారం, బ్యాంకు రోడ్డు, హైస్కూలు రోడ్డు, సూర్యనగర్, గోఖలే సెంటర్, బండారులంక, ఇందుపల్లి, సాకుర్రు, నడిపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రవికుమార్ తెలిపారు.

సర్క్యులేషన్ ప్యాటర్న్‌పై అభ్యంతరాలు స్వీకరణ

ముమ్మిడివరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో కంజెస్టడ్ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు ప్లానింగ్ అప్రూవల్ ఇవ్వడానికి ప్రజల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 4, 6, 18 వార్డులకు సంబంధించి తయారు చేసిన సర్క్యులేషన్ ప్యాటర్న్‌కు సంబంధించి ప్రజలకు సంబంధించి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నామన్నారు. టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని కంజెస్టడ్ ప్రాంతాల్లో కనీసం 12 అడుగులు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్లానింగ్ అప్రూవల్ మంజూరు చేయడానికి తయారుచేసిన సర్క్యులేషన్ ప్యాటర్న్‌పై అభ్యంతరాలు స్వీకరిస్తున్నామన్నారు. సర్క్యులేషన్‌కు సంబంధించిన కాపీలను బుధవారం నగర పంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డులో ప్రచరిస్తామన్నారు. వీటిపై సూచనలు, సలహాలు, అభ్యంతరాలుంటే నగర పంచాయతీ కమిషనర్ లేదా గొల్లలవీధి సచివాలయం వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీకు లిఖిత పూర్వకంగా, ఆన్‌లైన్‌లో ఏడు రోజులలోపు తెలియచేయాలన్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ముమ్మిడివరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బ్రహ్మకుమారి ఓంశాంతి ఆశ్రమంలో బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. బొంబాయి నుంచి ఆల్కాబెహన్ విచ్చేసి స్వఉన్నతి కోసం స్వయాన్ని పరివర్తన చేసుకునే మార్గాల గురించి అందరికీ ఆదర్శంగా నిలవాలంటే ఏం చేయాలనే విషయాలపై పలు సూచనలు ఇచ్చారు కాకినాడ ఇన్‌చార్జి రజనీ, బ్రహ్మకుమారి సోదర సోదరీమణులు బొంబాయి నుంచి విచ్చేసిన కల్యాణ్, మౌంటు అబు నుంచి విచ్చేసిన పరమేశ్వర్, ముమ్మిడివరం ఇన్‌చార్జి ఉమా, దేవిలతో పాటు పలు ఆధ్యాత్మిక విషయాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

మునిపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మునిపల్లి మాజీ సర్పంచ్ దోనిపాటి వెంకటేశ్వరరావు(90) బుధవారం మృతి చెందారు. ఆయన 2002నుంచి 2007 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యదర్శి డీబీ లోక్ సోదరుడైన వెంకటేశ్వరరావు అప్పట్లో గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన మృతికి అమలాపురం, పెద్దాపురం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, నిమ్మకాయల చినరాజప్ప, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, మాజీ సర్పంచ్‌లు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, నిమ్మకాయల నాగేంద్రప్రసాద్, నిమ్మకాయల సూర్యారావు, ఏసీబీ ప్రెజెంటింగ్ ఆఫీసర్ అయితాబత్తుల నాగమల్లేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు.

ఇష్టంతో చదివి లక్ష్యాన్ని సాధించాలి

మామిడికుదురు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఇష్టంగా చదివి లక్ష్యాన్ని సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పలు హైస్కూళ్లు, ఎలిమెంటరీ స్కూళ్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల పుస్తకాలు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన స్టడీమెటీరియల్‌ను వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పదో తరగతి సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్ష పేపర్లు ప్రాక్టీసు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎంఈవో ఎం.వెంకన్న బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనువైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం

మామిడికుదురు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు అనువైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మగటపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దుచేసి అనువుగా ఉండే స్థలాలను గుర్తించి గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, సూదా బాబ్జి, పెదపూడి రాము, ఉండ్రు శ్రీరామారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, నేరేడుమిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి బ్రిడ్జి కోర్సు తరగతులు

అమలాపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐటీఐలో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు పాలిటెక్నిక్ డిప్లమోలో రెండో సంవత్సరం నేరుగా చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు సిద్ధం చేయడానికి బ్రిడ్జి కోర్సు తరగతులు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ఈనెల30 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులు తమ పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన ధ్రువీకరణ పత్రాల జిరాక్సు కాపీలు తీసుకుని నేరుగా కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో సంప్రదించవచ్చునన్నారు. వివరాలకు సెల్ 9494688516ను సంప్రదించాలన్నారు.

ఏటికొప్పాక శకటానికి మూడో స్థానం రావడంపై హర్షం

అంబాజీపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఢిల్లీ కర్తవ్యపథ్‌లో ఏపీ తరపున ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శన శకటానికి మూడో స్థానం సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. శకటం రూపకల్పన చేసిన రాష్ట్ర సమాచార శాఖ జేడీ పోతుల కిరణ్‌కుమార్, అధికారుల బృందానికి, కళాకారులకు అభినందనలు తెలిపారు. మూడో సారి పాల్గొన్న ముక్కామల పసుపులేటి నాగబాబు కళాకారుల బృందానికి, జేడీ కిరణ్‌కుమార్‌లకు గంగలకుర్రు అగ్రహారం శివకేశవ యూత్ సభ్యులు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనులపై ఆడిట్ పారదర్శకంగా నిర్వహిస్తాం

మామిడికుదురు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులపై చేసే ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్ఆర్పీ కనకారావు తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సోషల్ ఆడిట్‌పై కోఆర్డినేట్ సమావేశం ఏపీవో రమేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏపీవో మాట్లాడుతూ సోషల్ ఆడిట్ గురువారం నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 10వరకు జరుగుతుందన్నారు. 2023-24లో ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలో 882పనులను రూ.5.50కోట్లతో నిర్వహించామని, ఆయా పనులపై గ్రామాల వారీగా తమ బృందాలు సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నయినాల సీతామహలక్ష్మి, జేఈ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సాయం పంపిణీ

అల్లవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దేవగుప్తంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బుంగ చిట్టిబాబు కుటుంబాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శించారు. బొమ్మి నరసింహమూర్తి, మంగాయమ్మఫౌండేషన్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి దుస్తులు, రగ్గులు, 25కిలోల బియ్యం, కూరగాయలు అందజేశారు. సర్పంచ్ సాధనాల వెంకట్రావు, చింతా రామకృష్ణ, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎన్.ఎలియారాజు, జంగా వెంకటేష్, బుంగ భూషణం వారి వెంట ఉన్నారు.

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాట్రేనిపాడు సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు అన్నారు. కాట్రేనిపాడులో పశువైద్య శాఖ ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. 60పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని పొన్నమండ పశువైద్యాధికారి డాక్టర్ బి.సంపత్‌కుమార్ తెలిపారు. వీఎల్‌వో విజయశేఖర్, గోపాలమిత్రలు డి.దుర్గారావు, ఎల్.సత్యనారాయణమూర్తి, ఏహెచ్‌ఏలు ఎం.సాయికుమార్‌రాజు, మురళీనాథ్, కె.కిరణ్‌కుమార్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్చి 1వరకు మహాసౌరయాగం

ఉప్పలగుప్తం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో ఈనెల30 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు నక్షత్ర నవగ్రహపూర్వక మహాసౌరయాగ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈయాగ కాలంలో ప్రతి రోజు గణపతి పూజ, వృక్షపూజ, చండీహోమం నిర్వహించనున్నట్టు యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ తెలిపారు. తమ నక్షత్రం రోజున ఆయా నక్షత్ర జాతకులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రత్యక్షంగా పూజల్లో పాల్గొనలేని వారు గోత్రనామాలతో నక్షత్ర పూజలు చేయించుకోవచ్చని సూచించారు. ప్రతి రోజు గోపూజ జరుగుతుందన్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి 7వతేదీ వరకు సాయంత్రం బ్రహ్మశ్రీ దెందులూరి సీతారామశర్మ ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. స్వచ్ఛ వాతావరణం, విశ్వశాంతి కోసం మహాసౌరయాగంలో భాగస్వాములు కావాలని రామకృష్ణశర్మ భక్తులకు పిలుపునిచ్చారు.

కొబ్బరికాయల లోడు పంపిస్తానని మోసం

పి.గన్నవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయల లోడును పంపిస్తానని నమ్మించి నగదు కాజేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం రాజులపాలెం శివారు అయినాలవారిపాలేనికి చెందిన కొబ్బరి వ్యాపారి గుత్తుల వెంకటేశ్వరరావుకు గత ఏడాది అక్టోబరు 16న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి కొబ్బరికాయల లోడు పంపిస్తానని నమ్మబలికాడు. వ్యానులో లోడు వస్తుందని డ్రైవర్ సెల్‌నెంబరు ఇచ్చాడు. లోడు అయిన ఫొటోను వెంకటేశ్వరరావుకు వాట్సాప్ ద్వారా పంపించడంతో ఆ వ్యక్తి అడిగిన రూ.45వేలను గూగుల్ పే చేశాడు. కొద్ది సమయానికి ఫోన్ పనిచేయకపోవడంతో వారి ఆచూకి దొరకలేదు. వారి కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.ఎస్ఐ శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

యానాం, జనవరి29(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ పరిధిలోని పలు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యానాం శివారు ఫరంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయుడు వలీ, రవిశంకర్ మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఏవిధంగా ముందుకు వెళ్లాలి సూచనలు చేస్తూ వివరించారు.

జిల్లా అదనపు,సెషన్స్‌కోర్టు జడ్జిగా శంకర్‌రావు

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి29(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం జిల్లా అదనపు, సెషన్స్‌ కోర్టు న్యాయమూర్తిగా ఎం.శంకర్‌రావు నియమితులయ్యారు. ప్రిన్సిపల్‌ సీవిల్‌ జడ్జిగా పనిచేస్తున్న శంకర్‌రావును పదోన్నతిపై జి ల్లా అదనపు, సెషన్స్‌కోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ ఏపీ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



మండపేటలో హెల్మెట్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్‌

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలి

● రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్‌

మండపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దిచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్‌ ధరించాల్సిందేనని అలా ధరించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని రామచంద్రపు రం సబ్‌ డివిజనల్‌ అధికారి రఘువీర్‌ ద్విచక్రవాహనదారులను హెచ్చరించారు. వాహనం నడిపేటపుడు ద్విచక్ర వాహదారుడు హెల్మెట్‌ ధరించకపోవటంవల్ల 80శాతం ప్రమా దాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా రామచంద్రపురం డివిజన్‌ పరిధిలో బుధవారం రామచంద్రపురంలో ప్రారంభమైన దిచక్రవాహనదారులు హెల్మెట్‌ ధరించి ర్యాలీ మండపేట వరకు సాగింది. మండపేటలో వాహనదారులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆటోల్లో అధికంగా ప్రయాణికులను ఎక్కించుకుని మితిమీరిన వేగంతో ప్రయాణించటం, కార్లలో సీటు బెల్టు ధరించకపోవటం, మద్యంసేవించి వాహనం నడపటం సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ వంటివి చేయటంవల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకోసం రవాణా పోలీసుశాఖ జారీచేసిన నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. సీటు బెల్టు, హెల్మెట్‌, ధరించటంవల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు.పట్టణంలో పెద్దకాల్వ వద్ద నుంచి స్థానిక కలువ పువ్వు సెంటర్‌ వరకు సాగింది. కార్యక్రమంలో రూరల్‌, అర్బన్‌ సీఐలు సురేష్‌, దొర్రాజు, మండపేట, మండపేట రూరల్‌ ,రాయవరం ఎస్‌.ఐలు హరికోటిశాస్త్రి, బుచ్చిబాబు, సురేష్‌, డివిజన్‌ పరిధిలోగల పోలీసుసిబ్బంది స్థాని కులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాల నియంత్రణకు హెల్మెట్‌ తప్పనిసరి

కొత్తపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం పోలీసులు హెల్మెట్‌ అవగాహనపై ర్యాలీ నిర్వహించగా ఆ ర్యాలీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యాననందరావు పాల్గొన్నారు. హెల్మెట్‌ ధరించి మోటార్‌ సైకిల్‌పై ప్రయాణిస్తూ అవగాహన కల్పించారు. వాడపాలెం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ ప్రమాదం జరగడమంటే రోడ్డుమీద పడటం కాదని, వారి కుటుంబమే రోడ్డున పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్క విలువైన ప్రాణం కోల్పోకూడదనే కూటమి ప్రభుత్వం ముఖ్యఉద్దేశమన్నారు. వాహనాలు నడిపే వారు హెల్మెట్‌ ధరించడం, అలాగే కార్లు నడిపేవారు సీటు బెల్ట్‌పెట్టుకోవడం తప్పనిసరని పేర్కొన్నారు. పోలీసులు చేస్తున్న ఈ అవగాహనకు ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బండారు సంజీవ్‌, రావులపాలెం రూరల్‌ సీఐ విద్యాసాగర్‌, తహశీల్దారు వై.రాంబాబు, ఎస్‌ఐలు జి.సురేంద్ర, రాంబాబు, రాము, అశోక్‌, నాయకులు పాల్గొన్నారు.


హెల్మెట్‌ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి

● మండల పరిషత్‌ సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆత్రేయపురం మండల పరిషత్‌ బడ్జెట్‌ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలస్థాయిలో అధికారులు చేపడుతున్న పథకాలపై ఆయన చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో లొల్ల లాకులను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని తద్వారా మంత్రులతో సమీక్షించామన్నారు. పిచ్చుకలంక, లొల్లలాకులు అందాలను పర్యాటకులు వీక్షించేందుకు పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఈ నేపథ్యంలో సంక్రాంతి పడవ పోటీలు కేరళ తరహాలో నిర్వహించి పర్యాటకులను ఆకర్షించామన్నారు.రాష్ట్రస్థాయిలోనే డ్రాగన్‌ పోటీలు మంచి పేరు ప్రఖ్యాతలను సాధించడం జరిగిందన్నారు. విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. వాడపల్లి వెంకన్న ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌ రూపొందించి అభివృద్ధికి బాటలు వేయడంతోపాటు ప్రసాదం స్కీమ్‌కు దరఖాస్తు చేశామన్నారు. భక్తుల సౌకార్యర్థం కాటేజీల నిర్మాణానికి దాతలు సహకారంతో త్వరలోనే శంకుస్థాపన నిర్వహిస్తామన్నారు. అభివృద్ధే తన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మండల పరిషత్‌ సమావేశం లో ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన బడ్జెట్‌ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిషత్‌లకు, పంచాయతీలకు గత రెండేళ్ల నుంచి స్టాంప్‌ డ్యూటీ జమకావడం లేదంటూ ఎంపీపీ అన్నపూర్ణ సర్పం చ్‌లు పాలా నాగేశ్వరరావు, జుజ్జవరపు శ్యామల సమావేశంలో ప్రస్తావించగా ఎమ్మెల్యే బండారు స్పందించి జిల్లా రిజిష్టార్‌తో ఫోన్లో మాట్లాడగా త్వరలో నిధులు జమచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అంకంపాలెం, పేరవరంలో లోవోల్టేజీ సమస్య అధికంగా ఉందని సత్వరమే చర్యలు చేపట్టాలని సర్పంచ్‌లు ముత్తాబత్తుల రాజు, గంటి విజయభారతి అధికారులను నిలదీశారు. ఉచ్చిలి జంగాలపేటలో తాగునీటి సమస్య అధికంగా ఉందని సభ్యురాలు మట్టా లక్ష్మి సభలో ఆవేదన వ్యక్తం చేశారు. వెలిచేరులో అక్రమ రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారంటూ ఎంపీటీసీ వేముల వెంకన్నబాబు సభలో ప్రస్తావించారు. ఇలా సభ్యులు అనేక సమస్యలపై ఎమ్మెల్యే సమక్షంలో ఏకరవు పెట్టారు. దీనిపై ఆయన స్పందిస్తు సభ్యులను సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీవో వెంకటరామన్‌ 2025-26 మండల పరిషత్‌ అంచనా బడ్జెట్‌ను నివేదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో తహశీల్దారు రాజేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆత్రేయపురం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు, ఎంపీడీవో రామన్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే, ఎంపీడీవోకు సత్కారం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తొలిసారిగా బుధవారం ఆత్రేయపురం మండల పరిషత్‌ సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఎంపీపీ కుండా అన్నపూర్ణ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయనకు ఘనస్వాగతం పలికి దుశ్శాలువాతో పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా సమావేశానికి రావడంతో ప్రజాప్రతినిధులు ఘన సత్కారం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరామన్‌ ఉత్తమసేవా పురస్కారం అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ఎంపీడీవోను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

చింతలూరులో పురంధరదాసు ఆరాధనోత్సవాలు

ఆలమూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పురుధరదాసు ఆరాధనోత్సవాలు బుధవారం నిర్వహించారు. దాస సాహిత్యానికి గుర్తింపు తెచ్చిన ప్రముఖ వాగ్గేయకారుడు, ఆధునిక కర్ణాటక సంగీత పితామహుడు పురధరదాసులు ఆరాధనోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడంలో భాగంగా పుష్య బహుళ అమావాస్య సందర్భంగా ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాగణంలో ఉన్న పురంధరదాసు విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం ఉదయం సాయంత్రం పురంధరదాసులు రచించిన వెంకటేశ్వరస్వామి భక్తిగీతాలను ఆలపించారు. ఈఉత్సవాలు మూడురోజులపాటు జరుగుతాయని ఆలయ కమిటీ వారు తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అల్లం రాజు రామకృష్ణమూర్తి, ఆలయ నిర్వాహకులు ద్విభాష్యం కాశీవిశ్వనాధశర్మ, అల్లంరాజు భరణీతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చింతలూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పురంధరదాసు ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకన్న ఆలయంలో భక్తజన సందడి


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,07,038 లభించినట్టు ఉపకమిషనర్‌, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ప్రారంభమైన భావనరుషి ఆలయ ప్రతిష్ఠ పూజలు

రాయవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి శివారు గోపడుతోటలో బుధవారం భద్రావతి సమేత భావనారుషి ఆలయ ప్రతిష్ఠ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఖానస పండితుడు పెదపూడి రఘురామ్‌ బృందం పాల్గొని విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌ వరుణం, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, హోమం తదితర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పసలపూడిలో భావనరుషి ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గణితశాస్త్ర అధ్యయనంపై అవగాహన సదస్సు

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి29(ఆంధ్రజ్యోతి):పట్టణంలో రామానుజన్‌ గణిత అకాడమీ ఆధ్వర్యంలో 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు గణితశాస్త్ర అవగాహన, అధ్యయనం చేసేందుకు గణితశాస్త్ర అధ్యయన కేంద్రం ప్రారంభిస్తున్నట్లు గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.వి. సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులచే విలువైన గణితశాస్త్ర గ్రంథాలు చదివించాలని, అరుదైన గణితశాస్త్ర సమస్యలు సాధన చేయించి ప్రతిష్ఠాత్మక గణిత పోటీలను ఎదుర్కొనేందుకు ఈ అధ్యయనం కేంద్రం కృషి చేస్తుందన్నారు. ఫిబ్రవరి 2న ఉదయం 9 గంటలకు 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.


దోమల నిర్మూలనకు చర్యలు

మండపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వవార్డు గొల్లపుంతకాలనీలో బుధవారం ఛైర్‌పర్సన్‌ పి.రాణి పర్యవేక్షణలో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ముత్యాల సత్తిరాజు పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది డ్రైన్లలో దోమల నిర్మూలనకోసం మందును పిచికారీ చేశారు. పట్టణాన్ని దోమలరహిత పట్టణంగా తీర్చిది ద్దటమే తమ లక్ష్యమని ఛైర్మన్‌ చెప్పారు.

కరుణామయ యూత్‌ చేయూత

మండపేట. జనవరి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరానికి చెందిన కరుణామయ యూత్‌ సభ్యులు ప్రతినెలా ఒక నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తూ ఆదుకుంటున్నారు. గత కొంతకాలం నుంచి యూత్‌ సభ్యులు ప్రతినెలా నిరుపేద కుటుంబంను ఎంపిక చేసుకుని వారికి ఆర్థిక చేయూత అందించడం ఆనవాయితీగా వస్తోంది. కేశవరం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రమళ్ల సత్యన్నారాయణ, భార్య చిన్ని ఆరోగ్యం బాగోకపోవటంతో విషయం తెలుసుకున్న సభ్యులు తమవంతు సాయంగా రూ.4000, నిత్యావసర వస్తువులు, 25 కిలోల బియ్యంను పాస్టర్‌ టి.ప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్‌ వ్యవస్థాపకుడు మందపల్లి పోలాప్రతాప్‌, గ్రామీణ వైద్యులు శ్రీనివాస్‌, శివాజీ, సంఘ సభ్యులు చుక్కా రాజేష్‌, చంద్రహాస్‌, రవి కుమార్‌ సిద్ధు, బాబి, సాగర్‌ అరుణ్‌ కుమార్‌, సుబ్బలక్ష్మి, యార్లగడ్డ చిట్టివిజ యలక్ష్మి, శ్రీకాంత్‌, రాకేష్‌ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ గోవిందరాజు మృతి



ఆలమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్ల మాజీ సర్పంచ్‌ అన్నందేవుల గోవిందరాజు(90) బుధవారం మృతి చెందారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పినపళ్ల గ్రామ సర్పంచ్‌గా 15సంవత్సరాలపాటు పనిచేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్‌ కాలేజీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా నాలుగు దశబ్దాలుగా పనిచేస్తున్నారు. ఈయనకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. గోవిందరాజు మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఫొటో గ్రాఫర్‌కు రూ.25 వేలు ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఫొటో గ్రాఫర్‌ లంక విజయకుమార్‌కు రామచంద్రపురం ఫొటోగ్రాఫర్స్‌ అసోసియేషన్‌ బుధవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్‌ అండ్‌ వీడియో గ్రాఫర్స్‌ అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి నాని, రామచంద్రపురం జోన్‌ అధ్యక్షుడు మధు, బాలకృష్ణ, ఎస్‌.ఆర్‌.కె పవన్‌ పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన ఉండాలి'

రాయవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): భారత న్యాయ సంస్కృతిలో చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని, చట్టాలపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలని అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు లీగల్‌ రిసోర్సుపర్సన్స్‌ టీవీవీ రమణమూర్తి, పి.వీరబాబు, పిలుపునిచ్చారు. బుధవారం విధాన్‌ సే సమాధాన్‌, జాతీయ మహిళా కమీషన్‌, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాయవరం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అన్నిరంగాల్లోను రాణించాలని, కుటుంబ వ్యవస్థలో మహిళలే కీలకమన్నారు. మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలు, గృహహింసను ఎలా ఎదుర్కోవాలి, మనోవర్తి, రక్షణ, నష్టపరిహారం, విడాకులు, న్యాయ సహాయం ఎలా పొందాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం కె.నాగేశ్వరరావు, సీసీ నాజర్‌ హుస్సేన్‌, ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.


చట్టాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు లీగల్‌ రిసోర్సుపర్సన్లు

డిగ్రీ కళాశాలలో క్విజ్‌ పోటీలు



క్విజ్‌ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రావులపాలెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహదారి భద్రత టీమ్‌ లీడర్‌ ఏ.శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్‌ కె.బాలసుబ్రహ్మణ్యం, సేఫ్టీ హెడ్‌ అనిల్‌కుమార్‌, టోల్‌ మేనేజర్‌ కేవీఎస్‌ఎన్‌ రెడ్డి విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు.

ఆలయ నిర్మాణ నిధులు రూ.8 లక్షలు అందజేత

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి29 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం శలపాక పెద్దపేటలో రామాలయం నిర్మాణానికి మంజూ రైన రూ.8 లక్షలు చెక్కును మంత్రి సుభాష్‌ తండ్రి వాసంశెట్టి సత్యం బుధవారం అందజేశారు ఆలయనిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో శలపాక గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న సత్యం

కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం


కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు, సీడీపీవో ఏ.గజలక్ష్మి అధ్యక్షతన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉబలంక, గోపాలపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీకాంత్‌, స్వాతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిసోర్స్‌ పర్సన్స్‌ గ్రామస్థాయి కమిటీలకు శిక్షణ ఇచ్చారు. 11 నుంచి 18 ఏళ్ల బాలబాలికలకు సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నైపుణ్య ఉపాధి, ఆత్మరక్షణ లింగవివక్షత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఇండస్ట్రియల్‌ టూర్‌కు ద్రాక్షారామ జడ్పీ విద్యార్థులు

ద్రాక్షారామ, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం ఇండస్ట్రియల్‌ టూర్‌కు వెళ్లారు. వృత్తి శిక్షణా కోర్సుల ప్రాముఖ్యం తెలియచేయడంలో భాగంగా ప్రతీనెలా నాలుగు ఇండస్ట్రియల్‌ జరపాలని నిర్ణయించారు. ద్రాక్షారామలో వీఅండ్‌సీ ఎంబ్రాయిడింగ్‌ వర్క్సు పరిశ్రమ పరిశీలన పర్యటన జరిపారు. వృత్తి శిక్షణా నిపుణుడు రెడ్డి కనక రాజశేఖర్‌ విద్యార్థులకు ఎంబ్రాయిడరీ పని వివరంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. గణిత ఉపాధ్యాయురాలు వి.భానుగాయత్రి, క్రాఫ్ట్‌ ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంబ్రాయిడరీని పరిశీలిస్తున్న విద్యార్థినులు

ఘనంగా సంవిధాన్‌ గౌరవ అభియాన్‌

ఆత్రేయపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రం ఆత్రేయపురంలో బుధవారం మండల బీజేపీ అధ్యక్షుడు ఉమిడిశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా భారత్‌ సమ్‌విధాన్‌, గౌరవ అభియాన్‌ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు కాలాబత్తుల చిన్నారి, అల్లు భాస్కరరావు, చేకూరి రమేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలి'

రాయవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ ప్రాజెక్టు వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ డి.ఆదిలక్ష్మి డిమాండ్‌ చేశారు. బుధవారం మండలంలోని మాచవరం ఐసీడీఎస్‌ సెక్టార్‌ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్స్‌, హెల్పర్లు ఆధ్వర్యంలో సోమేశ్వరం గ్రామంలో అంగన్‌వాడీల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యూటీ ఇవ్వాలని, అంగన్‌వాడీలను రెగ్యూలర్‌ చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో సెక్టార్‌ నాయకులు సీహెచ్‌ సత్యవేణి, ఎం.కమల పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● పశుసంవర్ధకశాఖ ఏడీ అనిత

కపిలేశ్వరపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు(ఏడీ) ఎల్‌.అనిత అన్నారు. బుధవారం మండలంలోని నేలటూరు, నాగులచెరువు గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధుల చికిత్సలు, మందుల పంపిణీ, కోళ్ళకు టీకాలు వేశారు. నేలటూరులో 88 గేదెలు, ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్‌ వీవీ రమణమూర్తి తెలిపారు. ఎంపీటీసీ రుద్రాక్షల వీరగౌరీకుమారి, కూటమి నాయకులు వల్లూరి శ్రీనివాసచౌదరి, గ్రామకార్యదర్శి, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రాయవరం: పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నదురుబాద సర్పంచ్‌ చింతపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం నదురుబాలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి నాగ శ్రావణి పశు పోషకులు పశువులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి సర్పంచ్‌, వైద్యురాలు చేతుల మీదుగా మందులను అందజేశారు.

కొత్తపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాడపాలెం ఉపసర్పంచ్‌ నాగాలక్ష్మికాంతం కోరారు. బుధవారం పంచాయతీ ప్రాంగణంలో జరిగిన పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొని నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో పలు పశువులను పరీక్షిం చి మందులు పంపిణీ చేశారు. జి.ప్రసాదరావు, బీర రమేష్‌, ఐ.రాజు తదితరులు పాల్గొన్నారు.


రాయవరం: నదురుబాదలో మందులను అందజేస్తున్న సర్పంచ్‌ శ్రీనివాసరావు


కపిలేశ్వరపురం: నేలటూరులో పశువులకు వైద్యపరీక్షలు చేయిస్తున్న ఏడీ అనిత

ఇంజరం కెనాల్‌ పనులతో శివారు భూములకు నీరు

కె.గంగవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంజరం కెనాల్‌లో చెత్త తొలగింపు, గట్లు అభివృద్ధి చేయడం వలన కె.గంగవరం, కాజులూరు మండలాల్లో శివారు భూములకు సాగు నీరు అందుతుందని యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వ రరావు(సుబ్బు) అన్నారు. బుధవారం ఆయన యర్ర పోతవరంవద్ద ఇంజరం కెనాల్‌పై జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. రూ.7లక్షలతో ఈ కాలువ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వది లేయడంతో కాలువ శివారు భూములకు సాగు నీటిసమస్య ఏర్పడేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఈ రబీలో సాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసకుంటున్నామని ఆయన వివరించారు.


ఇంజరం కాలువ పనులు పరిశీలిస్తున్న డీసీ సుబ్రహ్మణ్యేశ్వరరావు